


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 22 పుష్పం : 61-62 05-08-2002

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 16

**VOL : 7 ISSUE : 22**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278

## ఇతరులలోని దోషములను ఎంచరాదు

నిజమైన సాధకులు తాము చేయదగ్గ శ్రేష్టమైన ఖర్మ 'ఆత్మ' నిష్ఠలో నుండుటయే. ఆత్మనిష్ఠ నుండి కొంచెము జారిననూ, బంధములో, కర్మచక్రములో పడుటయే అగును. ఇతరుల విషయములలో జోక్యము కలుగజేసుకొనుట అనర్ధదాయకము. ఇతరులలోని లోపములను లెక్కింపక, కేవలము వారి సుగుణములనే ఎంచి చూడవలయును. అప్పడు జీవితము ఆనందదాయకమగును. సాధకుడు మిక్కిలి ప్రయత్నించి మార్చుకొనవలసినది తన మనస్సునే కాని, ఇతరుల మనస్సును కాదు. ఇతరుల యొక్క వికారముల నెంచినయడల తన మనస్సే మలినమగును. జ్ఞానులు మన మీద ప్రేమాభిమానములను చూపించుచున్నారంటే ఎనలేని మన దుర్గుణముల నన్నింటిని మన్నించి, అనుగ్రహించే వారి గొప్పగుణము 'కరుణ' వల్లే గాని, మనము నిరహంకారులమని, మధుర గుణ సంపన్నులమని కాదు. ఒక వేళ మనము తప్పు చేసినచో గర్వముచే తప్పిదము కప్పిపుచ్చక, చేసిన తప్పును ఒప్పుకొని, పరివర్తన చెంది, సన్మార్గముననే పోవలయును. సాధనా లక్ష్యము 'అహంకార' నిర్మూలనమై యున్నందున, ప్రయత్నించి శుద్ధము చేసుకోవలసినది మన మనస్సునే. మనస్సు తన ఉనికిని కోల్పోయి ఆత్మాకారము చెందుటయే కైవల్యము.

**- చావలి సూర్యనారాయణ మూర్తి, అమలాపురం**

**ఈ సంచికలో......** సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

16-06-2002 హైదరాబాదు ........................ 2
20-07-2002 పాలకోడేరు ........................ 10

Visit us @ www.srinannagaru.com





### (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 16-06-2002, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మహాత్ములు, పెద్దలు చెప్పిన మాటలను శ్రద్ధగా శ్రవణంచేయాలి, శ్రవణంచేసిన మాటలను మననం చేయాలి, మననం చేస్తేకాని అవి మనకు అనుభవంలోనికి రావు. రమణస్వామి చెప్పిన ప్రతీమాట కూడా ఆయన అనుభవంలోనుండి తీసిచెప్పారు, అది శాస్త్ర పాండిత్యంకాదు. మనందరకూ గురువు రమణాచార్యుడు. ఆ గురువు మీద, ఆయన చెప్పిన మాటలయందు మనకు విశ్వాసం ఉండాలి, అదే మూలధనం. గురువాక్యం మనలను అన్నమయకోశం, ప్రాణమయకోశం వీటినన్నింటిని దాటించి మనలను హృదయగుహలోనికి తీసుకొనివెళ్ళి అక్కడ నిలబెడుతుంది. గురువు చెప్పిన వాక్యంనందు మనకు విశ్వాసం లేకపోతే ఇది సాధ్యంకాదు. సాధ్యంకానిది సాధ్యం చేసుకోవాలంటే అది గురువు యొక్క మాటవలననే, గురువు యొక్క అనుగ్రహం వలననే సాధ్యపడుతుంది. ఉపదేశసారంలో మొదటి 15 శ్లోకాలు తత్వశాస్త్రంలో అన్నీ క్రోడీకరించి చెప్పారు, కాని చివరి 15 శ్లోకాలలో ఆయన హృదయాన్ని ఓపెన్‌చేసి విచారణామార్గాన్ని చూపారు, ఆయన అనుభవాన్ని జోడించి చెప్పారు. రమణాచార్యుడు ప్రతీమాట హేతుబద్ధంగా చెప్పారు, పదివాక్యాలలో చెప్పేది ఆయన ఒక్క వాక్యంలో చెప్పేవారు, ప్రతీది ఆయన అనుభవిస్తూ మనకు చెప్పారు. మీరు మిధ్యానేను గురించి చెపుతున్నారు, అందులోనుండి విడుదల పొందటమే సన్యాసం అని చెపుతున్నారు. అన్నీ బాగానే ఉన్నాయి చివరకు వచ్చేసరికి ఈ కొండ దేవుడు అంటున్నారు ఏమిటి, ఇది నచ్చలేదు అని ఒక అడ్వకేట్ భగవాన్‌ను అడిగారు. ఈ కొండను దేవుడు అని నేను నీకు చెపితే ఆక్షేపణగా ఉంది. ఈ దేహాన్ని నేను, ఈ శవాన్ని నేను అని నీవు అనుకొంటున్నావు. ఆ శవమే నీవు అనుకోవటంలో నీకు ఆక్షేపణగా లేదు. ఈ దేహమే నేను అని నీవు అనుకోవటం ఎంత నిజమో, ఆ కొండను దేవుడు అని నేను అనుకోవటం కూడా అంతే నిజం. ఇవి అన్నీ పాక్షిక సత్యాలు. నువ్వు తెలుసుకోవలసింది నీ మూలంలోనే ఉంది, నీ మూలంలోనే పరమేశ్వరుడు ఉన్నాడు. నీవు ఏ మార్గంలో ప్రయాణంచేసినా ఈ దేహమే నేను, ఈ దేహమే ఆత్మ అనుకొనే ఈ శవబుద్ధిలోనుండి విడుదలపొందాలి, అన్ని మార్గాల యొక్క లక్ష్యం అదే.

అహంకారము, మమకారము ఈ రెండూ దేహాన్ని అంటిపెట్టుకొని ఉంటాయి, వాటిలో నుండి విడుదల పొందటం సాధ్యమా అని అడుగుతున్నారు. సాధ్యమే. సాధ్యం కాని దానిని

సాధ్యం చేసుకోవటానికే సాధన. దైనందిన జీవితంలో మనభక్తిని పూజగదికి పరిమితం చేయకూడదు. సాధ్యమైనంత వరకు ఇతరుల విషయాలలో కలుగజేసుకోవద్దు అని భగవాన్ చెప్పారు. మనకు విషయచింతన ఎక్కువ, మనకు విషయాలే అమృతం క్రింద ఉన్నాయి. మనం లోకవిషయాలలో ఎక్కువగా కలిసిపోయే కొలది అహంభావన పెరిగే అవకాశం ఉంది. విషయచింతన వలన దేహమేఆత్మ అనుకొనేబుద్ధి పెరుగుతుంది, మనం దేనినైతే పోగొట్టుకోవాలి అనుకొంటున్నామో మనకు తెలియకుండా అది పెరిగిపోతుంది. దేహభావన పెరిగేకొలది వివేకం తగ్గుతూ ఉంటుంది. ఒక మనిషి వివేకవంతుడు కాకపోతే వాడు ఏ మార్గంలో ఉన్నా, వాడు ఎన్ని జన్మలు ఎత్తినా వాడికి జ్ఞానోదయం కలుగదు. ఎవడైతే జ్ఞానాన్ని కోరుకొంటున్నాడో వాడు ముందు వివేకవంతంగా జీవించటం నేర్చుకోవాలి. శరణాగతి మార్గం ద్వారాకాని, విచారణామార్గం ద్వారాకాని దేహము నేను అనే తలంపు నుండి విడుదల పొందవచ్చు. నీ ఇష్టదేవతను నిరంతరం చింతించటం వలన కూడా నీవు ఆత్మానుభవం పొందవచ్చు. అన్నింటికి గురువు అనుగ్రహం ముఖ్యం. ఆయన అనుగ్రహం లేకపోతే ఆయన చెప్పిన మాటకూడా మనకు అర్థంకాదు.

మనలను ఎవరైనా సంతోషపెడుతూఉంటే వారి పట్ల మనకు రాగం వస్తుంది, ఎవరైనా మనలను దుఃఖానికి గురిచేస్తూ ఉంటే వారిపట్ల మనకు సహజంగా ద్వేషం వచ్చేస్తుంది. రాగద్వేషముల వలన మనస్సు తొందరగా బాహ్యముఖానికి వెళుతుంది. రాగద్వేషములు బలీయంగా పనిచేస్తున్నాయి అనుకోండి, మీరు నేను ఎవడను విచారణ చేస్తున్నప్పటికి మీకు ట్రాఫిక్‌జామ్స్ పడుతూ ఉంటాయి అంటే ఏవో అడ్డంకులు వస్తూనే ఉంటాయి. అసలు లోపల ఉన్న సద్వస్తువుకి మనం చెప్పకొనే ఈ మాటలకు ఎటువంటి సంబంధంలేదు. మనం చేసేపూజ కోరిక లేకుండాచేస్తే మనం తొందరగా పవిత్రులవుతాము, మనకు లోచూపు కలుగుతుంది. సాకారానికి, నిరాకారానికి పేచీలు ఉన్నాయి కదా అని అడిగితే నా దృష్టిలో రెండూ సమానమే. వస్తువు ఒక్కటే దానికి ఆకారం ఉండవచ్చు, ఆకారం లేకపోవచ్చు. సాకారం తక్కువ, నిరాకారం ఎక్కువ అనే సమస్య లేదు. కృష్ణుడికి రూపం ఉన్నా దేవుడే, రూపం లేకపోయినా దేవుడే. ఆ శరీరం దేవుడుకాదు. మీరు ఈ భూమిమీద ఇంక ఎంతోకాలం ఉండరు, మీరు వెళ్ళిపోతున్నారు, ఇంక మాపట్ల ఎవరు దయచూపిస్తారు, ప్రేమ చూపిస్తారు అని చివరి రోజులలో భగవాన్‌ను అడిగితే మిమ్మల్ని ప్రేమించేది, అనుగ్రహించేది ఈ దేహం కాదు. ఈ దేహం ఉన్నప్పడు కూడా ఈ దేహం మిమ్మల్ని ప్రేమించటం లేదు, ఏదైతే మిమ్మల్ని ప్రేమిస్తోందో దానికి చావులేదు. అది ఎప్పడూ ఉంటుంది. అది కాలానికి అతీతం, ప్రాంతానికి



అతీతం. అహంభావనను తొలగించుకోవటం కష్టం, దానిని తొలగించుకోవాలంటే దైనందిన జీవితంలో నీ ప్రవర్తన వివేకవంతంగా ఉండాలి, నీవు వ్యక్తిభావన లేకుండా జీవించాలి.

మూలతలంపు యొక్క మూలం బయటలేదు, అది నీ లోపలేఉంది. రూపబుద్ధి, నామబుద్ధి తగ్గించుకోవటంవలన, సమబుద్ధిని ప్రాక్టీసు చేయటంవలన, అందరి క్షేమం కోరటం వలన, అభ్యాసబలంవలన, వైరాగ్యబలం వలన నీవు మూలతలంపు మూలంలోనికి వెళ్ళాలి. మూలతలంపు మూలంలోనికి వెళితే మనకు ప్రయోజనం ఏమిటి? మూలతలంపు మూలంలోనికి వెళితే మనం అమృతానుభవం పొందుతాము, మరణంలేనిస్థితిని పొందుతాము, అక్కడే సుఖం, శాంతి, ఆనందం ఉంది. మనం ఎంతోకొంత విచారణచేస్తూ ఉంటే, మూలతలంపు దానిమూలంలోనికి నెమ్మదిగా జరుగుతూ ఉంటుంది, అప్పడు మూలతలంపుకు వచ్చే ఇతరతలంపులు తగ్గుతూ ఉంటాయి. మనిషికి వైరాగ్యబలం, అభ్యాసబలం లేకపోతే వాడు మూలతలంపు మూలంలోనికి వెళ్ళలేడు. మనకు ఏకాంతవాసం తగ్గిపోయింది, జనంతోటి కలవటం ఎక్కువ అయింది. భక్తి ఎప్పడూ రహస్యంగా ఉండటం మంచిది. సాధకులకు ఏకాంతవాసం మంచిది, జనంతో ఎక్కువగా కలవటం మంచిది కాదు. మనందరం నేను ఎవడను? పుస్తకం చదువుతున్నాము కాని ఎవరూ దానిని గుండెకు పట్టించుకోవటంలేదు. మాటలు తగ్గించుకోండి. అవసరమైతే మాట్లాడండి. అవసరం లేకుండా మాట్లాడితే ఆగంటకు ఆగంట దేహాభిమానం పెరిగిపోతూ ఉంటుంది ఈ విషయం మనకు అర్థం అవ్వటంలేదు. దేనినైతే మనం పోగొట్టుకోవాలో దానిని డెకరేట్ చేయటానికే జీవితం పొడుగునా మాట్లాడుతున్నాము. దానివలన మనం ఏమి సాధిస్తాము, మనకు మనం నరకానికి మెట్లు కట్టుకొంటున్నాము, చనిపోయిన తరువాత మనకు చీకటి లోకాలు మిగులుతాయి. నియమములన్నింటిలోకి ఆహార నియమము ఉత్తమమైనది. తిండి ఎక్కువైతే నిద్ర వస్తుంది, తమోగుణం వస్తుంది, ఆలోచన తగ్గిపోతుంది. నిద్ర విషయంలోకూడా తగు మాత్రంగా ఉండాలి. నిద్రలో సాధన ఏమీ కుదరదు. అందువలన నిద్రావస్థను తగ్గించుకోవాలి, జాగ్రదవస్థను పెంచుకోవాలి. గాఢనిద్రలో నీవు ఎక్కడైతే ఉన్నావో అక్కడనుండే నేను అనే తలంపు వస్తుంది. గాఢనిద్రలో నీవు ఉన్నావుకాని ఎక్కడ ఉన్నావో నీకు తెలియటంలేదు. జాగ్రదవస్థలో ప్రయత్నంచేసి దేహము నేను అనే తలంపు ఎక్కడ నుండి వస్తోందో తెలుసుకొంటే గాఢనిద్రలో నీవు ఏస్థితిలో ఉన్నావో ఆస్థితిని జాగ్రదవస్థలో కూడా పొందవచ్చు. ఈకిట్లూ మీరు పట్టుకోండి. సుఖం అనేది బయట ఎక్కడాలేదు, లోపలేఉంది అని ముందుమనం విశ్వసించాలి, అది మనకు అవగాహన అవ్వాలి. ఆ అవగాహన వలన మనస్సు అణుగుతుంది.

అణిగిన మనస్సుకుకాని అమృతానుభవం కలుగదు. మీరు సాధన బాగా చేస్తూ ఉంటే ఈ దేహానికి అతీతంగా, లోకానికి అతీతంగా మన హృదయంలో ఏదో ఉందని అనుభవం మనకు కలుగుతూ ఉంటుంది. మీరు సాధనచేసేటప్పుడు సిద్ధులు కలుగవచ్చు, సిద్ధులు జోలికి మటుకు వెళ్ళవద్దు. సిద్ధులు దగ్గరకు వెళితే మీ మనస్సు బాహ్యాముఖానికి వెళుతుంది, ఉన్న సాధన ఊడిపోతుంది, లోకానికి దగ్గరవుతాము, భగవంతుడికి దూరమవుతాము. నీవు విచారణచేస్తూ ఉంటే, నీకు ధ్యానబలం పెరుగుతూఉంటే లోపలఉన్న వస్తువు నీకు స్ఫురిస్తూ ఉంటుంది. కాని అది పెర్మనెంట్ అవ్వదు. లోపల వాసనల యొక్క వేగం, తలంపుల యొక్క వేగం ఎక్కువగా ఉన్నప్పుడు వస్తువు స్ఫురించినప్పటికి ఆ అనుభవం నిలబడదు. వాసనలు పూర్తిగా వేరుతోసహా నశించినప్పడు ఆ అనుభవం నీకు స్థిరమవుతుంది. మనలో మూర్ఖత్వం ఉన్నంతసేపు దైవాభిముఖంగా మన జీవితాన్ని తీర్చిదిద్దుకోలేము. ఈ శవం భూమి మీద తిరుగుచున్నప్పడే కోరిక, కోపం యొక్క వేగం తగ్గించుకోవాలి. ఈ దేహం బూడిద అవ్వకముందే ఈ రెండింటిలోనుండి విడుదలపొందితే నీకు ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా సుఖమే. అప్పడు నీకు దేహం ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. జ్ఞానిలో నుండి టీచింగ్ సహజంగా వస్తుంది, అది ఆలోచించి చెప్పటం కాదు, అది ఆటోమేటిక్ డివైన్‌యాక్షన్. దేహము నేను అనే తలంపు ఎప్పడు నశిస్తుంది అని అడిగితే నీకు సహజస్థితి కలిగినప్పడు, నీవు ఎవరివో నీకు పూర్తిగా గోచరమైనప్పడు దేహము నేను అనే తలంపు నశిస్తుంది. మనం ఏదిగా ఉన్నామో అది మనకు తెలిస్తే సహజస్థితి. మనం ఏదిగా ఉన్నామో దానికి సంబంధించిన అవగాహన మనకు లేనప్పడు ఈ జన్మలోనేకాదు, రాబోయే జన్మలోకూడా మనం అసహజస్థితిలోనే ఉంటాము. దుఃఖానికి కారణం బయటలేదు, నీలోపలేఉంది, కర్తృత్వరూపంలో ఉంది. నిన్ను కర్తృత్వం పెట్టుకోమని నేను చెప్పటంలేదు. కర్తృత్వాన్ని నీవే కల్పించుకొంటున్నావు, అది నీ స్వభావంలో ఉంది, అందువలన నీ స్వభావాన్ని మార్చుకో, నీవు మారుమనస్సు పొందు. మనం కల్పించుకొన్న విషయాలే మనకు దుఃఖాన్ని తీసుకొని వస్తున్నాయి అని భగవంతుడు రిపీటెడ్‌గా చెపుతున్నాడు. మీరు సాధనపేరు మీద పెద్ద కష్టపడినట్లు మాకు కనిపించటంలేదు, అరుణాచలం రాకముందే మధురైలోనే నేను పొందవలసింది పొందాను అని చెపుతున్నారు. మేము ఎంత కష్టపడినా మాకు ఏమీ రావటంలేదు అని భగవాన్‌ను అడిగితే మీరు ఏద్వైతే సాధన అనుకొంటున్నారో, తపస్సు అనుకొంటున్నారో, సాధన పేరు మీద చాలా ఇబ్బందులు, బాధలు పడుతున్నాము అనుకొంటున్నారో అవి అన్నీ నేను పూర్వజన్మలో పడి ఉండవచ్చునుకదా అని చెప్పారు. ఎంత





సహజంగా చెప్పారో చూడండి. మనలను ఎవరైనా మీరు భగవంతుడి యొక్క అవతారం అంటే చాలా సంతోషిస్తాము. కాని భగవాన్‌ను మీరు కుమారస్వామి యొక్క అవతారం అంటే గుడిలోరాయిని పెట్టి దానిని భగవంతుడు అంటున్నారు అలాగే ఈ దేహాన్ని కుమారస్వామి అంటే అనుకోనివ్వండి అని అన్నారు. పూర్ణశరణాగతిలో నీకు సంకల్పం అంటూ ఏదీరాదు. ఈ గౌరవాలు, అగౌరవాలు, సన్మానాలు ఇవిఅన్నీ దేహాభిమానం ఉన్న జీవుడికే. పూర్ణశరణాగతి చెందిన వాడికి ఇవి ఏమీలేవు. మన గురించి మనకంటే భగవంతుడికి ఎక్కువ తెలుసు. మనం సాధనలో ఉన్నప్పడు టర్నింగ్ ఎప్పడు ఇవ్వాలో ఆయన చూసుకొంటూ ఉంటాడు. మనం ఒకోసారి గురువుకు దూరమవుతాము. గురువుకు దూరమయిపోయాము అని మనం అనుకొంటాముకాని ఆయన దగ్గరకు తీసుకోవటానికే అలాచేస్తూ ఉంటాడు. భౌతికంగా అన్ని ప్రేమలకంటే తల్లి ప్రేమ గొప్పది, కాని నీ ప్రేమ ముందు తల్లి ప్రేమ సరిపోదు అని అరుణాచలేశ్వరుడితో భగవాన్ అంటారు. ఒకవేళ నీకు భక్తుడిని అవ్వటానికి నాకు అర్హతలేదు అనుకో నీ భక్తుడికి భక్తుడిగా చెయ్యి సరిపోతుంది అన్నారు. అది వినయానికి గుర్తు. మీ దేహప్రారబ్ధాన్ని బట్టి చదువు, డబ్బు, కీర్తి అన్నీ రావచ్చు కాని మీరు అవినయం రాకుండా చూసుకోవాలి. మనం పతనమవ్వటానికి లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఈ ఆకర్షణల నుండి మనకు రక్షణ ఇచ్చేవాడు గురువే. ఈ ఆకర్షణల నుండి మన మనస్సును మళ్ళించి, దానికి లోచూపు నేర్పేవాడు గురువే. జీవితంలో అన్నీ తలంపులే. చావు ఒక తలంపు, పుట్టుక ఒక తలంపు, గౌరవం ఒక తలంపు, దుఃఖం ఒక తలంపు, అన్నీ తలంపులే. తలంపుకానిది ఒక్కటే ఉంది అది మన హృదయంలో ఉన్న సత్యం. అది మనకు అనుభవంలోనికి వచ్చినప్పడు అన్ని రకాల బాధలనుండి విడుదల పొందుతాము.

మనదేహం ప్రారబ్ధాన్ని బట్టి వచ్చింది. ప్రారబ్ధం లేకపోతే అసలు దేహంరాదు. ప్రారబ్ధం మనకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా దానిని స్వీటుగా అనుభవించాలి. ఈశ్వరుడికి తెలియకుండా ఏదీరాదు, అంతా ఆయనకు తెలిసే ఇది జరుగుతోంది అనే నమ్మకం మనకు ఉండాలి. నీకు ఏద్దైనా కష్టం వచ్చినా ఆకష్టం ద్వారా ఏ వెలుగులోనికి నా కళ్ళు తెరిపిస్తాడో, ఏ ఉన్నతస్థానంలోనికి నన్ను తీసుకొని వెళతాడో అని అనుకొని ప్రారబ్ధాన్ని స్లోగా, స్వీట్‌గా ఎంజాయ్‌చేయాలి. అలాచేస్తే మిధ్యానేను వేరుతో సహా నశిస్తుంది. మనకు అక్కరలేని తలంపులు వచ్చినప్పడు నొప్పి కలుగుతుంది. ఇది ఇలా జరగాలి అనుకొంటాము, కాని అలా జరుగదు అప్పడు నొప్పి వస్తుంది. అలా జరగాలి అనుకొనేది మీ అహంభావనే, నొప్పి తెచ్చుకొనేది మీ అహంభావనే, సఫర్ అయ్యేది మీ అహంభావనే. అహంభావన వలననే ఇవి అన్నీ వస్తున్నాయి.

ఎందుకు పనికిరానిది ఈ అహంభావన కాని మనం దానిని ముస్తాబు చేసుకొంటూ కాలక్షేపం చేస్తున్నాము ఇంక మనకు జ్ఞానోదయం ఎలాగ కలుగుతుంది. సాధన పేరుమీద అహంభావనను ముస్తాబు చేసుకోవటంకాదు సాధనపేరుమీద అహంభావరహితస్థితిని పొందాలి. దేహమే నేను అనుకోవటం వలన ఆ దేవుడు ఎక్కువ, ఈ దేవుడు ఎక్కువ అని మీకు అనిపిస్తుంది. దేవతల విషయంలో మనం బేధబుద్ధి పెట్టుకోకూడదు, బేదబుద్ధి పెట్టుకొంటే మీరు పతనమవుతారు. మీ ఇష్టదేవతమీద మీరు ఆత్మబుద్ధి పెంచుకోండి అలా అని ఇతర దేవతలను అగౌరవపరచవద్దు. ఎవరు ఏ రూపాన్ని ఆరాధించినా, ఎవరు ఏ నామాన్ని స్మరించినా వారు శ్రద్ధగా, భక్తిగా, ప్రేమగా చేస్తే వారు నన్నే పొందుతారు అని భగవంతుడు చెప్పాడు, నన్నే అంటే బ్రహ్మంను పొందుతారు. ఈ లోకం మంచిదికాదు, చెడ్డదికాదు. ఇది ఒక అద్దంలాంటిది. నీ మొఖంలో ఉన్నది అద్దం చూపిస్తుంది. మసి ఉంటే తుడుచుకొంటావు, కాని తుడుచుకోమని అద్దం చెప్పదు. అలాగే ఈ లోకం నీలో ఉన్న బలహీనతలను చూపిస్తుంది. నీవు ప్రయత్నంచేసి ఆ బలహీనతలనుండి విడుదల పొందాలి.

నీ హృదయంలో ఉన్న వస్తువు గురించి నీకు తెలియకపోవచ్చుకాని నీ దేహం, నీ మనస్సు తెలుస్తున్నాయికదా వీటిని మేగ్జిమమ్ ఉపయోగించుకొని నీలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చెయ్యి. దేహపోషణకు సరిపడ పనిచేసుకో. లోకంతో అతిగా ఉండవద్దు. మనం ఏదైనా సేవచేస్తే దానివలన దేహగతమైన నేను నశించాలి. ఆసేవవలన దేహగతమైన నేను ముస్తాబు అవుతోంది అనుకోండి ఆ సేవ వలన మంచి కంటే నీకు చెడ్డ ఎక్కువ వస్తుంది. నువ్వు ఎన్నిచేసినా దేహగతమైన నేను ఉంటే అన్నీ ఉన్నట్లే పుణ్యం ఉంది, పాపం ఉంది, జన్మలు ఉన్నాయి, అది లేకపోతే ఏదీ లేదు. ఉన్నది చైతన్యమే. గాఢనిద్రలోనుండి జాగ్రదస్థలోనికి రాగానే నేను అనే తలంపు అతి వేగంగా వచ్చి దేహంతో తాదాప్యంపొందుతుంది. నేను అనే తలంపువచ్చాక ఇతర తలంపులు వస్తాయి. నేను అనే తలంపు దేహంతో తాదాప్యంపొందిన మరుక్షణంలో లోకచింతన, విషయచింతన, దైవచింతన అన్ని చింతనలు వచ్చేస్తాయి. గాఢనిద్రలో నుండి బయటకు వస్తే మనకు స్వప్నావస్థ అయినా, జాగ్రదవస్థఅయినా వస్తుంది. భగవాన్ ఏమని చెప్పారు అంటే సత్యానికి సంబంధించినంతవరకు స్వప్నావస్థకు, జాగ్రదవస్థకు ఏమీతేడాలేదు అది పొట్టిగా ఉంటుంది, ఇది పొడవుగా ఉంటుంది అని చెప్పారు. స్వప్నావస్థలో నామరూపాలు, విషయచింతన ఉంటాయి, జాగ్రదవస్థలో కూడా నామరూపాలు, విషయచింతన ఉంటుంది. స్వప్నావస్థ ఎంత అసత్యమో జాగ్రదవస్థకూడా అంతే అసత్యం. గాఢనిద్రలోనే మనం సత్యానికి దగ్గరగా



2A

ఉన్నాము. గాఢనిద్రలో నువ్వు ఉన్నావు, సుఖంగా ఉన్నావు, శాంతిగా ఉన్నావు, ఎక్కడ ఉన్నావో నీకు తెలియదు. గాఢనిద్రలో ఎక్కడ ఉన్నావో జాగ్రదవస్థలో నువ్వు సాధన చేసి అక్కడకు చేరుకోవటానికి ప్రయత్నంచెయ్యి. మూలతలంపు మూలంనీకు తెలిసినప్పడు నీవు అక్కడ ఉండగలవు. దానిని ఊహించటానికి ప్రయత్నం చేయవద్దు. మూలతలంపును ఉపసంహరించుకొంటూరా. ఏదో ఒక వాసన మరల మూలతలంపును బాహ్యముఖం చేస్తుంది మరల దానిని ఉపసంహరించు. విచారణ చేస్తూ మనం మూలతలంపును ఉపసంహరించుకొంటూ వెళితే మూలతలంపు ఎక్కడయితే ఉదయించిందో అక్కడకు వెళ్ళిపోతాము. మూలతలంపు దాని మూలాన్ని చూస్తే అది నశిస్తుంది. అప్పడు హద్దులులేని సుఖం, శాంతి, ఆనందం నీకు అందుతాయి. నీకు అమృతానుభవం కలుగుతుంది. మీ హృదయంలో ఉన్న ఆనందంవచ్చి మీ సహస్రారమును ముంచినప్పడు భగవంతుడు వచ్చి ఎదురుగా నిలబడినా కళ్ళు ఎత్తి చూడాలనిపించదు మీకు ఇష్టంలేకపోవటంకాదు, ఆ ఆనందం అట్టిది, అనుభవం అట్టిది. అమృతానుభవం పొందకుండా ఈ శరీరం విడిచిపెడితే నష్టం ఇంతని చెప్పటానికి లేదు, అపారమైనది, అది మాటలలో చెప్పలేము. సత్యానుభవం పొందినవాడు ఏమాట చెప్పినా అది వేదము. ఎందుచేతనంటే ఆ మాటనిన్ను జ్ఞానం దగ్గరకు తీసుకొనివెళుతుంది. సాధన అంటే మనం లోపలకు ప్రయాణంచేయాలి. మనం లోపలకు వెళ్ళాలంటే రజోగుణం, తమోగుణం తగ్గించుకోవాలి, సత్వగుణాన్ని ప్రాక్టీసుచేయాలి, సత్పురుషులతో సహవాసం చెయ్యాలి, శాస్త్రం మీద విశ్వాసం కలిగిఉండాలి, మనం ఎలా జీవిస్తే గురువు అనుగ్రహం పొందుతామో ఆరకంగా మన జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి. అసలు సాధన దేనికి అంటే మిధ్యానేనులోనుండి విడుదలపొందటానికే సాధన లేకపోతే సాధన యొక్క ప్రయోజనంలేదు. దేహగతమైన నేను పోగొట్టుకొంటే సరిపోతుంది, నువ్వు సంపాదించేది ఏదీలేదు అన్నారు భగవాన్. ఇది పోగొట్టుకొంటే ఉన్నది ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది.

దేహం చనిపోతుంది. దేహం చనిపోయేటప్పడు నేను చనిపోతున్నాను అనుకొంటాము. నిజమైన నేను అనుకోదు ఎందుచేతనంటే నిజమైన నేనుకు అసలు శరీరమేలేదు, శరీరమేలేనప్పడు నేను చనిపోతున్నాను అని ఎందుకు అనుకొంటుంది. ఈ శరీరం ఎవరిది అంటే నాది అంటాము. శరీరం నాది అని చెప్పే ఈ నేను ఎవరు? అది మిధ్యానేను. అది దేహంతో తాదాప్యం పొంది ఉంటుంది. దేహం చనిపోయేటప్పడు నేను చనిపోతున్నాను అంటుంది. కాని దేహం చనిపోయిన తరువాతకూడా మనం ఉంటాము. ఉండము అనే తలంపు వలన మనకు దుఃఖం వస్తోంది. మన హృదయంలో మరణంలేని

వస్తువు ఒకటి ఉంది. దానికి దేహానికి ఎట్టి సంబంధంలేదు. అది మనమై ఉన్నాము కాబట్టి ఈ దేహం మరణించినా మనం ఎప్పుడూ ఉంటాము అనే అనుభవం మీకు వస్తే ఆ క్షణంలో దుఃఖలేనిస్థితిని, భయంలేనిస్థితిని పొందుతారు. మనలను దుఃఖంలేని స్థితికి తీసుకొని వెళ్ళటానికే భగవాన్ టీచింగ్, అంతేగాని కాలక్షేపానికి కాదు. సాధనరేపు చేసుకొందాము అని కొంతమంది అంటారు. రేపుకు రూపు లేదు అందువలన వర్తమానకాలాన్ని ఉపయోగించుకోండి. మిధ్యానేను పోవటానికి సాధనలో చిట్కాలు ఏమిటి అంటే మీరు జరిగిపోయిన గొడవలు మర్చిపోండి. ఎలా మర్చిపోవాలంటే గోడ అవతల ఉన్న వస్తువులు మనకు కనబడవు అలాగ గోడకట్టినట్లుగా భూతకాలాన్ని వదిలివేయాలి. అలాకాకుండా జరిగిపోయిన గొడవలు అస్తమాను తలపెట్టుకొంటే దొంగనేను బలిసిపోతుంది. భవిష్యత్ గురించి ఊహించవద్దు. ఎందుచేతనంటే అనుకొనేది మన సంకల్పం జరిగేది ఈశ్వర సంకల్పం. మన దేహప్రారబ్దంలో ఉన్నది కోరికలేకుండానే వచ్చేస్తుంది అది రాదనుకొని కోరికలు మొదలుపెడతాము. వర్తమానకాలంలో వచ్చినదానిని సంతోషంగా స్వీకరించండి, దానిని మీరు రిజెక్టు చేయవద్దు. అప్పుడు ఈ దొంగనేను పోతుంది. భగవాన్‌లో ఎక్కడా మనకు వ్యక్తి భావన కనబడదు, ఆయన దగ్గరనుండి మనం నేర్చుకోవలసింది ఇమ్‌పర్సనల్ బిహేవియర్. స్వామీ మీ గురించి మేము అరుణాచలం వచ్చాము అని అంటే మీరు నాగురించి అరుణాచలం వచ్చాము అంటున్నారు, మరి నేను ఎవరిగురించి అరుణాచలం వచ్చాను. ఏ ఈశ్వరుడు అయితే నన్ను ఇక్కడకు తీసుకొని వచ్చాడో ఆయనే మిమ్మల్ని కూడా ఇక్కడకు తీసుకొని వచ్చాడు అని చెప్పారు అంతేగాని నేను తీసుకొని వచ్చాను అని చెప్పలేదు. దైనందిన జీవితంలో ఈ దొంగనేనును ఎక్కువగా వాడవద్దు. నేను అది చేసాను, నేను ఇది చేసాను అంటూ ఉంటే దొంగనేను పెరిగిపోతుంది. మనం ఏరకంగా జీవిస్తే వ్యక్తిభావన నశిస్తుందో ఆరకంగా జీవించటం నేర్చుకోవాలి. మహాత్ములు, పెద్దలు చెప్పినది శ్రద్ధగా శ్రవణం చేయండి, దానిని మననం చేయగా చేయగా అది మనకు అనుభవంలోనికి వస్తుంది, అప్పుడు దాని తాలూక సుఖం మనకు అందుతుంది. మనలను మనం ఉద్ధరించుకోవటమే లోకాన్ని ఉద్ధరించటం, మనలను మనం సంస్కరించుకోవటమే లోకాన్ని సంస్కరించటం. సాధనచేసి ఎవడైతే అహంభావరహితస్థితిని పొందాడో వాడి ద్వారా లోకానికి ఎంతో మేలు జరుగుతుంది, వాడి సంకల్పంతో పని లేకుండా వాడి ఉపాధిద్వారా లోకానికి ఎంతో మేలు జరుగుతుంది, నిజమైన సేవ జరుగుతుంది. దేహంలోపల నేను ఉన్నాను, దేహం బయట లోకం ఉంది అని అజ్ఞాని అనుకొంటాడు. లోపల, బయట అనే బుద్ధి జ్ఞానికి లేదు. అంతా తానుగానే ఉంటాడు కాబట్టి వాడి ద్వారా నిజమైన సేవ జరుగుతుంది.



## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-7-2002, పాలకోడేరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

పెద్దలయందు, దేవతలయందు మనం గౌరవం కలిగిఉంటే వారు ఏలోకంలో ఉన్నా వారి ఆశీస్సులు మనకు అందుతూ ఉంటాయి, మన క్షేమం వారు కోరుతూ ఉంటారు. మనం పెద్దలపట్ల ప్రేమగా ఉండటంవలన, సహృదయం కలిగిఉండటం వలన భగవంతుని అనుగ్రహానికి పాత్రులవుతాము. వ్యాసుడు పుట్టిన రోజును గురుపౌర్ణిమగా మన పెద్దలు నిర్ణయించారు. ఆయన వేదాలను విభజించాడు అందువలన ఆయనకు వేదవ్యాసుడు అని పేరు వచ్చింది. ఆయన మహాభారతం, బ్రహ్మసూత్రాలు వ్రాసాడు. మానవజీవితం ఏవిధంగా ఉండాలి, గృహస్థాశ్రమం ఏవిధంగా ఉండాలి, సన్యాసాశ్రమం ఏవిధంగా ఉండాలి, ఏ ఆశ్రమంలో మానవుడు ఏవిధంగా జీవించాలి అనేది వ్యాసుడు మనకు వివరించాడు. అందుచేత మానవజాతి అంతా ఆయనకు ఋణపడి ఉంది. చెరువులో ఉన్ననీరు ఎగిరి సరాసరి వచ్చి మన ఇంటిలో పడదు, నీరు కుళాయిల ద్వారా వస్తుంది. అలాగే ఈశ్వరానుగ్రహం, ఈశ్వరుని ప్రేమ గురువు ద్వారా ప్రవహిస్తుంది, ఈశ్వరానుగ్రహం అందటానికి గురువు మనకు సహకరిస్తాడు. హిందూమతంలో గురువుకు చాలా ప్రాముఖ్యత ఇచ్చారు. గురువులు అందరు ఈశ్వరుని ప్రతినిధులే. ఏ గురువు ద్వారా నీకు అనుగ్రహం అందినా అది ఈశ్వరుని దగ్గరనుండే వస్తోంది. భగవాన్‌కు మాకు ఉన్న సంబంధం జన్మాంతర సంబంధం. అది కేవలం ఈ జన్మకు సంబంధించినది కాదు. నాకు భగవాన్ చెప్పిన బోధల కంటే భగవాన్ పటం అంటే ఎక్కువ ఇష్టం. ఏదైనా భగవాన్ పుస్తకం 10 నిమిషాలు చదివితే 15 నిమిషాలు భగవాన్ పటం చూస్తాను. నేను పటమే ఎక్కువ చూస్తాను, నాకు మాటలకంటే పటమే సరిపోతుంది అనిపిస్తుంది. మేము పెద్దపెద్ద తపస్సులు చేయలేకపోయినా మీకు జ్ఞానోదయం కలగటానికి ఏవైనా మంచిమాటలు చెప్పటానికి రమణానుగ్రహం కారణం, అందులో సందేహం ఏమీలేదు. కృష్ణుడు మీద భక్తి ఉన్నా, బాబా మీద భక్తి ఉన్నా, రమణస్వామి మీద భక్తి ఉన్నా, ఎవరి మీద భక్తి ఉన్నా అది భక్తే. భక్తి వలన మనం తరిస్తాము. భక్తికి మించిన భాగ్యంలేదు. భక్తే నిజమైన భాగ్యం. భక్తి లేకుండా జ్ఞానం కలుగదు. స్వస్వరూప అనుసంధానమే భక్తి అని ఆచార్యులవారు చెప్పారు. స్వస్వరూప అనుసంధానం వలననే మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. సముద్రంలో ఉన్న నీరు అంతా త్రాగేయగల శక్తి నీకు ఉన్నప్పటికీ, ఎన్నో మహిమలు చేసే